క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



గుడివాడ టౌన్: స్థానిక శ్రీరామ్‌పురం శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర బాల గంగాధర స్వామి దేవస్థానంలో శనివారం శివపార్వతుల శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పవిత్ర కార్తిక మాసంలో ఈ కల్యాణం చేయడం అవసరమని నిర్వాహకులు అన్నారు. 108 మంది దంపతులు ఈ కల్యాణంలో పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కన్వీనర్ పి.దుర్గామల్లేశ్వరరావు, కార్యదర్శి తిప్పా కోటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రహదార్ల వెంబడి ధాన్యం ఆరబోత



పామర్రు: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు తడిసిపోయిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వరి పంటలను మిషన్ల సహాయంతో కోతలు కోయిస్తున్నారు. ధాన్యాన్ని రహదార్ల వెంబడి ఆరబెడుతున్నారు. కనీసం 48 గంటల వరకు ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. తేమశాతం ఎక్కువగా నమోదైతే తమకు ఏమి ధరగిట్టడంలేదని రైతులు వాపోతున్నారు. గోనె సంచులు, హమాలీల కొరత ఏమీ లేదని అంటున్నారు.

డిజిటల్ అక్షరాస్యతపై కళాజాతా



యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు, పెదపారుపూడి, వెంట్రప్రగడ, గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో శనివారం జిల్లా సహకార కేంద్రబ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో డిజిటిల్ ఆర్థిక అక్షరాస్యతపై వై.వీరయ్య, రవితేజ కళాజాతా బృందం రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతిబీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం, రూపే కార్డు, డెబిట్ కార్డు వాడకం వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు. యలమర్రు పీఏసీఎస్ చైర్‌పర్సన్ మూల్పూరి నరేంద్ర, బ్యాంక్ కార్యదర్శి గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

94 సారా కేసుల పరిష్కారం

కైకలూరు: స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సర్కిల్ పరిధిలో 94 సారా కేసులు పరిష్కారమయ్యాయని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) సీఐ ఎస్.రాంబాబు శనివారం చెప్పారు. కైకలూరు నియోజకవర్గ పరిధిలో సారా, అక్రమ మద్యం, గంజాయి, పేకాట, కోడిపందేల వివరాలు తెలిస్తే 9440902448 నంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

టిడ్కో గృహాల వద్ద పారిశుద్ధ్య పనులు

గుడివాడ టౌన్: టిడ్కో గృహాల నివాసాలు పెరగడం వలన పురపాలక సంఘ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యపనులు ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఇప్పటి వరకు గృహాలు ఆక్రమణ కాకపోవడంతో అక్కడ పనులకు ప్రాధాన్యం ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు గృహాల్లో ఉండటం వల్ల పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ కారణంగా చెత్తను తొలగించి, దోమల నివారణ మందును చల్లిస్తున్నామని తెలిపారు.

పంటల పరిశీలన



పామర్రు: మండల పరిధిలో తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను సీపీఎం, కౌలు రైతు సంఘ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది ఎకరాల్లో తీవ్ర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముళ్లపూడి విల్సన్, కౌలు సంఘ నాయకులు కాటూరి నాగభూషణం, కొక్కిలిగడ్డ లక్ష్మణరావు, ఆదిశేషు, మండేలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే విజయం

- అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్
- 17 నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక షష్ఠి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక షష్ఠి ఉత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ విజయవంతమయ్యేలా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆలయ వార్షిక షష్ఠి ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్డీవో ఖాజావలి ఆధ్వర్యాన అన్నిశాఖల అధికారులతో ఆలయ ఆవరణలో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు తరలివస్తారన్నారు. ఇందుకనుగుణంగా ఆయా శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా..

భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రత్యేక పర్వదినాలైన షష్ఠి, రథయాత్ర, తెప్పోత్సవం, అన్నసమారాధన వంటి రోజుల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, తహసీల్దార్ కే శ్రీనివాస్, ఎంపీడీవో పీ మల్లీశ్వరీ, కై కలూరు సీఐ కృష్ణకుమార్, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, చైర్మన్ శౌంతి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, రంగిశెట్టి నరసింహారావు, ఆనందదాసు లక్ష్మీనారాయణ, రాచూరి కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వనసమారాధనలో...

గురజ శ్రీగంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన కార్తిక మాస వనసమారాధనను ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత స్వామివారిని దర్శించుకొని పూజలు చేసిన అనంతరం సమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన కార్తిక మాసంలో సమారాధన నిర్వహించేందుకు ముందుకు వచ్చిన ఆలయ పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఎంపీపీ, ఆలయ ధర్మకర్త మీసాల రామకృష్ణ, మోట్రు ఏసుబాబు, బత్తిన కిషోర్, కూనపురెడ్డి సత్యనారాయణ, గణేషుల సురేష్, పగడాల సాయిరాం పాల్గొన్నారు.

తేరుకుంటున్న రైతులు



చినపులిపాకలో నీటి ముంపు నుంచి బయటపడిన వరి పనలు



చినపులిపాకలో ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

తోట్లవల్లూరు: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలతో నీటి ముంపునకు గురైన వరిపొలాల రైతులు క్రమంగా తేరుకుంటున్నారు. రైతులు పొలాల నుంచి ముంపు నీటిని బయటకు పంపే పనులు చురుగ్గా చేపట్టడంతో పాటు సస్యరక్షణ చర్యలు నిర్వహిస్తున్నారు. పొలాల్లో నీరు దాదాపుగా తగ్గుముఖం పట్టడంతో ప్రత్యామ్నాయ పనులపై రైతులు దృష్టి సారిస్తున్నారు. యంత్రాల ద్వారా ధాన్యం నూర్పిడి చేసిన రైతులు కల్లాల్లో ధాన్యం ఆరబెట్టే పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు ధాన్యం మిల్లులకు అధికారులు తరలించగా, ఇంకా మిగిలిన ఉన్న ధాన్యాన్ని కూడా మిల్లులకు పంపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో రెండు రోజుల్లో వరికోతలు మళ్లీ ప్రారంభించే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు తెలియజేశారు.

ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

ధాన్యం సేకరణ ప్రత్యేకాధికారి రాంబాబు



శ్రీహరిపురంలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న అధికారి రాంబాబు

ముదినేపల్లి రూరల్: తుపాను వల్ల పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ధాన్యం సేకరణ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ ఎ.రాంబాబు అన్నారు. మండలంలోని శ్రీహరిపురం, సింగరాయపాలెం, వడాలి గ్రామాల్లో రాంబాబు శనివారం పర్యటించారు. తుపాను వల్ల దెబ్బతిన్న వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టం అంచనాలకు ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో వ్యవసాయాధికారితో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ స్థాయిలో స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకుడితో కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలు క్షుణ్ణంగా పరిశీలించి పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు కృషి చేస్తాయన్నారు. మండలంలో 14 వేల ఎకరాల పైబడి సార్వా వరి సాగు చేయగా 4 వేల ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయినట్లు చెప్పారు. ఇంకా 800 టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిబంధనలను సడలించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిల్లర్లతో మాట్లాడి రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూస్తున్నట్లు చెప్పారు. పలువురు రైతులు దెబ్బతిన్న పంటలను అధికారికి చూపి న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ కే శ్రీనివాస్, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఆలయంలో లక్ష బిల్వార్చన



మండవల్లిలోని మల్లేశ్వరస్వామి

మండవల్లి: మండవల్లిలో భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. శ్రీ మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ఆలయ అర్చకుడు గూడూరు శ్రీనివాసరావు లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారు, అమ్మవార్లకు జరిగిన లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వీక్షించారు. గూడూరు శాస్త్రి, ఎ.శ్యాంబాబు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ



మండవల్లిలో ర్యాలీలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏఎస్ఐ రాజు తదితరులు

మండవల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 18 నుంచి 21 ఏళ్ల వయస్సు గల వారు ఓటర్లుగా నమోదు చేసుకునేలా చైతన్యం కలిగించడానికి శనివారం స్వీప్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరుగా నమోదు కావాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఏఎస్ఐ రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వంటపాత్రలు అందజేత

కోడూరు: జరుగువానిపాలెం గ్రామానికి చెందిన అప్పికట్ల లంకేశ్వరరావు పూరిల్లు మిచాంగ్ తుపానుకు కుప్పకూలింది. బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సభ్యులు వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, 25 కిలలో బియ్యం కట్టను శనివారం అందజేశారు. శాఖ మండల చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, కాగిత రామారావు, సభ్యులు తోట శ్రీనివాసరావు, జన్నా రవిశంకర్, కొండవీటి సురేష్, వేణు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్



గుడివాడ టౌన్: మాదిగ ఉద్యోగులు, బంధువుల ఉప కులాల ఐక్య క్రిస్మస్ ఉత్సవ్ విలాప్-2023 శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాదిగ ఉప కులాల నాయకులు పాల్గొన్నారు. వివిధ చర్చీలకు సంబంధించిన పాస్టర్ల ప్రార్థనలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం తొలుత నాయకులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుడ్‌మెన్ పేట చిన్నారులు వేసిన కోలాటం పలువురిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్టేట్ డైరెక్టర్ అప్పికట్ల వల్లభాయ్ పటేల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కంచెర్ల సుధాకర్, వెంపటి సైమన్, నాగబాబు, అత్తాటి సాల్మన్, పట్టా సాయివర ప్రసాద్, వేశపోగు విజయ్‌బాబు, ఘంటసాల దానియేలు, కటికల అబ్రహం, మామిళ్ల ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది

గుడివాడరూరల్: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు పట్టణంలో పలు చోట్ల లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిని అదుపులోకి తీసుకుని శనివారం చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వాహనచోదకులు, ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. పట్టణంలో వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని, డ్రైవింగ్ లైసెన్స్‌లేని వారిపై, మద్యం సేవించిన వారిపై ఎంవీయాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనాలను నడిపే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

లోక్ అదాలత్‌లో 898 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న 11వ అదనపు జిల్లా జడ్జి సుబ్రహ్మణ్యం

11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం

గుడివాడ టౌన్: మండల న్యాయ సేవాధికార కమి టీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 898 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ముగ్గురు న్యాయమూర్తులతో మూడు బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. సివిల్ కేసులు 15, క్రిమినల్ 860, ఇతర కేసులు 23, మొత్తం 898 కేసులు పరిష్కరించామని తెలిపారు. వీటి విలువ రూ.కోటి 5 లక్షల 97 వేల 300గా గుర్తించినట్లు ఆయన వివరించారు. ఈ సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం : సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు: లోక్ అదాలత్‌ల ద్వారా ఇరుపక్షాల కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తోందని సీనియర్ సివిల్ జడ్జ్, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎస్‌వీ లక్ష్మి చెప్పారు. కైకలూరు కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. లోక్ అదాలత్‌పై మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తోందన్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు నమోదు చేసుకున్న కేసుల్లో రాజీ మార్గం ఉత్తమన్నారు. జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడెం వీరవెంకట సత్యనారాయణ, బార్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఎంఎస్ఎస్.రాజు, కార్యదర్శి బి.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ చావలి శంకర శాస్త్రి, అడిషనల్ పీపీ వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, లోక్‌అదాలత్ కమిటీ మెంబర్స్ పి.పవన్ కాంత్, డి. శివప్రసాద్, న్యాయవాదులు అడ్డగర్ల రాంబాబు, గంగాధర్ రావు, జితేంద్ర, జయప్రకాష్, శ్రావణి అలేఖ్య పాల్గొన్నారు.

590 కేసులు పరిష్కారం..

కైకలూరు కోర్టు పరిధిలో క్రిమినల్, ప్రీ లిటిగేషన్, పెట్టీకేసులు, చెక్‌బౌన్సు, మనోవర్తి, ఆస్తి తగాదాలు, ప్రొహిబిషన్, బీఎస్ఎన్ఎల్ తదితర 590 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా రూ.18,33,669 నగదును జమ చేశారు.

అంగన్‌వాడీలకు నియామకపత్రాల అందజేత



నియామక పత్రాలు స్వీకరించిన అంగన్‌వాడీ సిబ్బందితో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా నియమితులైన వర్కర్లు, సహాయకులకు కై కలూరు నివాసం వద్ద ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నియామక పత్రాలను శనివారం అందించారు. సహాయకులుగా పనిచేస్తూ, ఉద్యోగోన్నతిపై నున్న కవితాలక్ష్మి (కైకలూరు 6వ వార్డు), దోనె అన్నపూర్ణ (తక్కెళ్లపాడు, మండవల్లి మండలం) అంగన్‌వాడీ వర్కర్లుగా నియమితులయ్యారు. నూతన సహాయకులుగా తమ్మిరెడ్డి లక్ష్మి (కైకలూరు 14వ వార్డు), యార్లపాటి మౌనిక (పెదలంక), యాళ్ల దయామణి (సోమేశ్వరం), గొర్ల లక్ష్మి శ్రావణి (కొండూరు-2), నాగెళ్ల కృష్ణవేణి (మండవల్లి-1), బొర్రా నాగజ్యోతి (ముదినేపల్లి-3) నియామక పత్రాలు అందుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఆనంద్, సూపర్‌వైజర్ షాహిదాబేగం పాల్గొన్నారు.

పలువురికి అభినందనలు

నామినేటెడ్ పదవులు పొందిన పలువురిని ఎమ్మెల్యే డీఎన్నార్ అభినందించారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొంతు వెంకట అప్పారావు, కలిదిండి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నిర్ణయించిన ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన బత్తిన కిషోర్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డీఎన్నార్ ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, నాయకులు శీలం రామకృష్ణ, వీరారెడ్డి, సాక్షి సాయిబాబు, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు శీలం రామకష్ణ, జగన్నాథ స్వామి ఆలయ చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎం.సుధాకర్ రెడ్డి, అనగాని వెంకటేశ్వరరావు, ఉడత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ప్రముఖులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ

పామర్రు: అమర గాయకుడు ఘంటసాల 101 జయంతి వేడుకల సందర్భంగా స్థానిక విజయవాడ రోడ్డులోని కరుమారి అమ్మన్ (అంకమ్మ తల్లి) ఆలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సంగీత విభావరి, ఘంటసాల-ఎన్టీఆర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది ప్రముఖులను గుర్తించి అవార్డులను అందజేశారు. పులిగడ్డకు చెందిన సింగోతు వెంకటేశ్వరరావు, పెనమకూరుకు చెందిన పాడుగు ప్రభాకర్, ఏలూరుకు చెందిన ఆలా వెంకటరావు, ఏలూరు రంగాపురంకు చెందిన ఉప్పల ఏసుమోహనరావు, బేతవోలుకు చెందిన దాసరి ఆంనదరావు, విజయవాడకు చెందిన గంగరాజు లక్ష్మీలాస్య, పెనుగొండ గ్రామానికి చెందిన చివటం సుబ్బారావు, గుడివాడకు చెందిన ముదరకోల శ్రీనివాసరావులను ఘనంగా సన్మానం పొందినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఘంటసాల కళాపీఠం గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, కాటూరి వెంకట మురళీ కృష్ణ, కళాపీఠం సభ్యులు వరదా అప్పారావు, కాటూరు మోహనరావు, భవిరి శంకర్‌నాథ్, టి.వంశీధర్, పోతన వెంకటేశ్వరరావు, ద్రోణావజ్ఝుల ముక్తేశ్వర్, కె.చంద్రశేఖర్‌రావు, తోట రమేష్, బొగ్గరపు సాయిబాబు, పరిశ నాంచారయ్య, కె.మల్లేశ్వరమ్మ, ఎస్.నాగిరెడ్డి, దగ్గుమిల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

కైకలూరు: కార్తిక మాసం సందర్భంగా స్థానిక శ్యామలాంబ అమ్మ వారి దేవస్థానంలో కోటి దీపోత్సవం వైభవంగా శనివారం రాత్రి నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్, రామలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ బూరుబోయిన మోహనరావు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

హనుమాన్ చాలీసా పారాయణం



రేమాలవారిపాలెం(నాగాయలంక): పేర్లవానిలంక గ్రామంలోని రామాలయంలో శనివారం 108 పర్యాయాల హనుమాన్ చాలీసా పారాయణం, పూజలు వైభవంగా జరిగాయి. గ్రామస్తులు, టి.కొత్తపాలెం శ్రీ సీతారామ భక్త సేవా సమాజం నేతృత్వంలో చాలీసా, భజన నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి కార్తిక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేర్ల భీమేశ్వరరావు, రాజేష్, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ పిరాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరేశ్వరుడికి నవధాన్యాల అలంకరణ



నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో నగరేశ్వరుడిని వరి కంకులు, నవధాన్యాలతో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు అలంకరించారు. నవధాన్యాల అలంకారంతో పూజ జరిపితే లోక కల్యాణం సిద్ధించి రైతులకు వరి సిరి కలుగుతుందని అర్చకుడు చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, ఆర్య వైశ్య సంఘ ప్రముఖులు తాడికొండ సత్యనారాయణ, దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, మునగాల మోహనరావు, చిట్టా శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సాయం

ఎదురుమొండి(నాగాయలంక): మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని ఎదురుమొండి దీవిలో ఇళ్లు దెబ్బతిని నిరాశ్రయులైన 20 కుటుంబాలకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సాయం అందజేశారు. కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ నేతృత్వంలో వంట సామగ్రి కిట్లు, టార్పాలిన్లు బాధితులకు అందజేశారు. సర్పంచ్ భర్త కన్నా వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకరనాథ్, మండల చైర్మన్ శివ విష్ణువర్ధన్, వైస్ చైర్మన్ మునగాల కుటుంబరావు, జీవితకాల సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం, పప్పు పంపిణీ



మండవల్లి అంగన్‌వాడీ సెంటర్-1లో సరుకులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఝాన్సీ

మండవల్లి: మండవల్లి అంగన్‌వాడీ సెంటర్-1లో ఫోర్టిఫైడ్ బియ్యం 3 కేజీలు, కందిపప్పు కేజీ, అరకేజీ వంట నూనె, బాలామృతం ప్యాకెట్, 13 గుడ్లు సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకున్నారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు పౌష్టికాహారం నిర్ణీత సమయాలకు ఇవ్వాలని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.